సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 28 । మార్చి । 2025

I



సమ్మె బాటలో మీటర్ రీడర్లు!

విద్యుత్ మీటర్ రీడర్లు సమ్మె బాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారంపై **విశాఖలో సీఎండీతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి.** IIలో ▸



సమస్యలు తొలగేనా?

రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ఐటీల్లో విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. IIలో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహరి శనివారం (ఉదయం)
భీమవరం	6.21	4.40
నరసాపురం	6.22	4.39
తాడేపల్లిగూడెం	6.17	4.49

కూటమి దౌర్జన్యకాండ

ఎంపీపీ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలను అధికార టీడీపీ తుంగలోకి తొక్కింది. వైఎస్సార్‌సీపీకి ఏకపక్షం కావాల్సిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవుల్లో పాగా వేయాలని చూసింది. పచ్చమూకల్ని ఉసిగొల్పి ఎన్నికలను అడ్డుకుంది. అత్తిలిలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను నిర్బంధించగా యలమంచిలిలో కోరం సరిపోయినా పొంతన లేని కారణాలతో ఎన్నికలు వాయిదా వేశారు. కైకలూరులో అల్లరి మూకలు రెచ్చిపోయాయి.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ఎంపీపీ పదవుల కోసం టీడీపీ చిల్లర రాజకీయాలు
- అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి ఇంటిని చుట్టుముట్టిన పచ్చమూకలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎన్నికకు హాజరు కాకుండా అడ్డగింత
- ఫిర్యాదుచేసినా పట్టించుకోని పోలీసులు
- యలమంచిలిలో కోరం సరిపోయినా ఎన్నిక వాయిదా
- కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నికలో ఉద్రిక్తత



అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇంటిని చుట్టుముట్టిన కూటమి శ్రేణులు

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్/ అత్తిలి/ కైకలూరు: తణుకు నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అత్తిలి ఎంపీపీ ఎన్నికల్లో కూటమి మూకలు రెచ్చిపోయారు. అత్తిలిలో 20 ఎంపీటీసీ స్థానాలకు గాను గత ఎన్నికల్లో 16 చోట్ల వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన చెరో రెండు చోట్ల గెలుపొందాయి. ఇటీవల మాజీ ఎంపీపీ, మరో సభ్యుడు కూటమి పంచన చేరగా, ఒక సభ్యురాలు గల్ఫ్ వెళ్లడంతో వైఎస్సార్‌సీపీ సంఖ్యాబలం 13, కూటమి సభ్యులు ఆరుగురు అయ్యారు. ఐదుగురు ఎంపీటీసీ సభ్యులను తమ వైపు లాక్కుని ఎంపీపీ పదవి కాజేయాలని ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ ఎన్నో ప్రయత్నాలు చేసినా వైఎస్సార్‌సీపీ సభ్యులు లొంగలేదు. చివరకు కాబోయే ఎంపీపీ రంభ సుజాతకు చెందిన పెట్రోల్ బంకులపై విజిలెన్స్ అధికారులతో దాడులు చేయించినా ఫలితం లేకపోవడంతో ఎన్నిక జరుగకుండా అడ్డుకునే ఎత్తుగడ వేశారు.

కవ్వించి.. చుట్టుముట్టి..

అత్తిలిలోని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసం నుంచి గురువారం ఉదయం 13 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు మండల పరిషత్ కార్యాలయానికి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. వారిని అడ్డుకునేందుకు అప్పటికే అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు కారుమూరి నివాసాన్ని చుట్టుముట్టారు. రోడ్డుపై మోటారు సైకిళ్ల అడ్డంగా పెట్టి గొడవకు దిగారు. ఒక దశలో గేట్లు తోసుకుంటూ లోపలకు వచ్చేందుకు ప్రయత్నించడంతో ఎంపీటీసీ సభ్యులు భయాందోళనలతో తలుపులు వేసుకుని లోపలే ఉండిపోయారు. పచ్చమూకలు కవ్వింపు చర్యలకు పాల్పడినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ వచ్చారు. ఉదయం 8 గంటలకు మొదలైన ముట్టడి ఎన్నిక సమయం ముగిసే వరకు కొనసాగింది. 12 గంటల తర్వాత ఎన్నిక శుక్రవారం నాటికి వాయిదా పడినట్టు సమాచారం వచ్చాక పచ్చమూకలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



కూటమి ఆగడాలను అడ్డుకునేందుకు తన నివాసం వద్ద మండుటెండలో కూర్చున్న మాజీ మంత్రి కారుమూరి



అత్తిలిలో కూటమి నేతలు ధ్వంసం చేసిన కెమెరాను పరిశీలిస్తున్న సాక్షి ఛానల్ కెమెరామేన్

మండుటెండలోనే కారుమూరి

ఎవరొస్తారో రండంటూ మాజీ మంత్రి కారుమూరి పచ్చమూకలకు ఎదురుతిరిగారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎక్కడికి కదలకుండా వారు ఉన్నంతసేపు దాదాపు నాలుగు గంటల పాటు ఇంటి ఎదురుగానే కూర్చుండిపోయారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ఆయన వెంట ఉన్నారు.

పోలీసుల 'పచ్చ'పాతం

అత్తిలిలో దాదాపు వంద మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేసిన అధికారులు దాదాపు అందరినీ మండల పరిషత్ కార్యాలయం వద్దనే మోహరించారు. తమ ఎంపీటీసీ సభ్యులకు రక్షణ కల్పించాలని పలుమార్లు వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులను కోరినా వారు స్పందించలేదు. కూటమి శ్రేణుల కారుమూరి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల సృష్టిస్తున్నా చేష్టలుడిగి చూశారే తప్ప ఆపే ప్రయత్నం చేయలేదు. మీడియా ప్రతినిధులు సైతం పలుమార్లు సమస్యను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా వస్తున్నామంటూ ఎన్నికల సమయం ముగిసే వరకూ కాలం గడిపేశారు. మాజీ మంత్రి కారుమూరి సమస్యను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. లా అండ్ ఆర్డర్ విధులను పక్కనపెట్టి కూటమి నాయకులు చెప్పినట్టుగా పోలీసుల వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుల తరఫున మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు విప్ ఎకనాల్జెడ్మెంట్‌ను అందజేసేందుకు వెళ్లిన పార్టీ రాష్ట్ర నేత వడ్లూరు సీతారామ్‌ను పోలీసులు అడ్డుకుని బయటకు నెట్టేశారు.

ఎన్నికల ప్రక్రియను కవరేజీ కోసం వచ్చిన సాక్షి టీవీ చానల్ కెమెరాను కూటమి నాయకులు లాక్కుని వైర్లు తెంపివేశారు. వీడియో చిత్రీకరిస్తున్న వారిపై వాటర్ ప్యాకెట్లను విసిరారు.

యలమంచిలిలో హైడ్రామా

యలమంచిలి మండలంలో హైడ్రామా నడుమ ఎన్నిక వాయిదా పడింది. 17 మంది ఎంపీటీసీలకు 13 మంది వైస్సార్‌సీపీ, నలుగురు కూటమి సభ్యులు ఉన్నారు. గురువారం నాటి ఎంపీపీ ఎన్నికకు పూర్తిస్థాయిలో సభ్యులు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ ఎంపీపీ ఎన్నిక లాంఛనమేనని అంతా భావించారు. కాగా తమకు ఓటెయ్యాలని వైఎస్సార్‌సీపీ నాయకుల నుంచి తమకు బెదిరింపులు వస్తున్నట్టు కూటమి సభ్యులు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం, అధికారులు ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేయడం గమనార్హం. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ పూర్తి సంఖ్యాబలం ఉండటంతో ఎన్నిక జరిగితే తమకు పదవి రాకుండా పోతుందన్న ఉద్దేశంతో టీడీపీ అధికార బలంతో ఎన్నికను వాయిదా వేయించిందని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ విమర్శించారు.

కైకలూరులో అరాచకం

కైకలూరులో వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూటమి నేతలు అరాచకానికి తెగబడ్డారు. 20 ఎంపీటీసీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ, కూటమికి సమాన బలం ఉంది. వైఎస్సార్‌సీపీకి చెందిన భుజబలపట్నం ఎంపీటీసీ సభ్యుడు పెన్మత్స సూర్యనారాయణరాజును ఎన్నికకు హాజరుకాకుండా కూటమి నేతలు అడ్డుకున్నారు. కూటమి నేతల ఆగడాలను కవరేజీ చేస్తున్న భవ్య న్యూస్ రిపోర్టర్ కురేళ్ల కిషోర్‌ను కూటమి నేతలు చితకబాదడంతో గాయలపాలై కైకలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీని రాకుండా అడ్డుకోవడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) మీడియా ముఖంగా నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు ఎవరూ హాజరుకాలేదు. కూటమి పార్టీకి చెందిన 9 మంది మాత్రమే హాజరుకావడవంతో కోరం లేక ఎన్నికను శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ వాయిదా వేశారు.

తణుకు చరిత్రలో చీకటి రోజు

మాజీ మంత్రి కారుమూరి

అత్తిలి: కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, ఇది ఒక బ్లాక్ డే అని, తణుకు నియోజకవర్గ చరిత్రలో ఇటువంటి దారుణ ఘటన ఎన్నడూ జరగలేదని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఎంపీపీ ఉప ఎన్నికకు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకుండా కూటమి మూకలను ఉసిగొల్పడంపై గురువారం ఆయన అత్తిలిలో మీడియాతో మాట్లాడారు. ఉదయం నుంచి ఎస్పీ, డీఎస్పీ, సీఐ అందరికీ ఫోన్ చేసినా కానీ.. ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. తమ ఎంపీటీసీ సభ్యుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారని, తాము ఎవరినీ తీసుకుపోలేదని, తమ మ్యాండెట్‌పై గెలిచినవారని తెలిపారు. తమ వారినే ఇద్దరిని వారు తీసేసుకున్నారని అన్నారు. ఎన్నికలకు వెళ్లాల్సిన తమ పార్టీ ఎంపీటీసీ సభ్యులను కూటమి నేతలు దౌర్జన్యంగా రౌడీలను పెట్టి అడ్డుకున్నారని, తన ఇంటిపైకి వచ్చి రౌడీయిజం చేశారని చెప్పారు. చివరికి మహిళలని కూడా చూడకుండా తోసేసి దుర్మార్గంగా ప్రవర్తించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ తరఫున ఎంపీపీగా చేసిన మక్కా సూర్యారావును మభ్యపెట్టి తీసుకున్నారని, అయినా తాము మాట్లాడలేదని, నేడు దుర్మార్గంగా ఎన్నికకు వెళ్లకుండా సభ్యులను అడ్డుకున్నారని మండిపడ్డారు. 'మీకు 6 ఉంటే, మాకు 13 ఉన్నాయి.. అయినా సరే దారుణాతి దారుణంగా రౌడీయిజంతో దుర్మార్గం చేశారు.. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం.. అసలు పోలీస్ వ్యవస్థ టోటల్‌గా విరుద్ధంగా అయిపోయింది.. టోటల్ ఫ్లాప్.. ప్రభుత్వానికి తొత్తుల్లా వ్యవహరించారు.. ఇంత దౌర్జన్యం చేస్తున్నా, ఆడవాళ్లను తోసేస్తున్నా ఎస్పీ, డీఎస్పీ, సీఐ ఒక్కరు కూడా ఇక్కడి రాలేదు.. నేను మాజీ మంత్రిని, నేను ఫోన్ చేసినా, చాలా మంది కౌన్సిల్ చైర్మన్‌లు ఫోన్‌లు చేసినా స్పందించలేదు, ఫోన్లు కూడా ఆపేశారు.. ఇది చాలా దుర్మార్గమైన, హేయమైన చర్య..' అంటూ కారుమూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకష్ణ చేసే దుర్మార్గాలకు చాలా మూల్యం చెల్లించుకోవాల్సిన రోజులు వస్తాయని కారుమూరి స్పష్టం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

అడ్డదారులు టీడీపీకి కొత్త కాదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

యలమంచిలి: అడ్డదారులు తొక్కి అధికారం చేజిక్కించుకోవడం తెలుగుదేశం పార్టీ డీఎన్ఏలో ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. గురువారం యలమంచిలి ఎంపీపీ ఎన్నికను వాయిదా వేసిన నేపథ్యంలో ముదునూరి విలేకరులతో మాట్లాడారు. యలమంచిలి, అత్తిలి, కైకలూరులో వైఎస్సార్ సీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ ఎన్నికను వాయిదా వేయడం అప్రజాస్వామికమన్నారు. ముఖ్యంగా యలమంచిలిలో వైఎస్సార్ సీపీకి 13 మంది సభ్యులతో పూర్తి మెజార్టీ ఉంటే నలుగురు సభ్యులున్న తెలుగుదేశం, జనసేన సభ్యులను బెదిరించాల్సిన అవసరం తమకు ఏముంటుందని ప్రశ్నించారు. సాకులు చూపుతూ అధికారులు ఎన్నికను వాయిదా వేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తమ సభ్యులు లొంగిపోరని స్పష్టం చేశారు. కూటమి నాయకులు శుక్రవారం కూడా తమ పార్టీ సభ్యులను సమావేశానికి వెళ్లకుండా అడ్డగించినా, దౌర్జన్యం చేసినా న్యాయబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. ప్రలోభాలకు గురిచేసి అధికారం చేజిక్కించుకోవాలనుకోవడం నీచమైన చర్య అని ముదునూరి అన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి

ప్రజాస్వామ్యం అపహాస్యం



అత్తిలిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు

అత్తిలి: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కూటమి శ్రేణులు అరాచకాలకు పాల్పడ్డాయని అత్తిలి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు విమర్శించారు. తమకున్న ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. గురువారం అత్తిలి ఎంపీపీ అభ్యర్థిని, అత్తిలి-1 ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత మాజీ మంత్రి కారుమూరి నివాసంలో తన సహచర ఎంపీటీసీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి మెజార్టీ సభ్యులు ఉన్నా కూటమి నాయకులు అక్రమంగా ఎన్నికను అడ్డుకోవడం దారుణమన్నారు. పోలీసులు వచ్చి తమకు రక్షణ కల్పించకుండా ఏమీ తెలియనట్టు వ్యవహరించారని వాపోయారు. కుటిల సంస్కృతికి కూటమి ప్రభుత్వం తెరతీసిందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ దారం శిరీష మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా పార్టీపై ఉన్న అభిమానంతో తమ పార్టీ అభ్యర్థికి ఓటువేయడానికి వెళుతుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. లక్ష్మీనారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు ఆడారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగేంచేలా కూటమి శ్రేణులు దాడులు చేయడం హేయం అన్నారు. ఎంపీటీసీ సభ్యులు అద్దంకి శ్రీను, సుంకర నాగేశ్వరరావు, కూరాకుల లక్ష్మి, దొమ్మేటి రమ్య, నల్లమిల్లి నాగమణి, శరకడం రామలింగ విష్ణుమూర్తి, గుడిమెట్ల ధనలక్ష్మి, పురుషోత్తపు నాగేంద్ర శ్రీనివాస్, ముదునూరి దుర్గా భవాని తదితరులు మాట్లాడారు.

టీటీసీలో శిక్షణకు దరఖాస్తులు

భీమవరం: టీటీసీలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ఈ.నారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలో మే 1న శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. టీసీసీ లోయర్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని, మే 1 నాటికి 18–45 ఏళ్లలోపు వయసు ఉండాలని తెలిపారు. ఏప్రిల్ 25లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

పంచాయతీల్లో ప్రలోభాల ఎర

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా 15 పంచాయతీల్లో గురువారం నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో కూటమి కుట్ర రాజకీయాలు చేసింది. తమ సానుభూతిపరులకు పట్టం కట్టేందుకు ప్రలోభాలకు తెర లేపింది. కొన్నిచోట్ల వారి ప్రయత్నాలు ఫలించగా, చాలాచోట్ల వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల విశ్వసనీయతే గెలిచింది.

- వీరవాసరం మండలం పెర్కిపాలెంలో ఎం.మంగారావు (వైఎస్సార్‌సీపీ) ఎన్నికయ్యారు.
- ఇరగవరం మండలం కొత్తపాడులో మండపాక విజయ (వైఎస్సార్‌సీపీ) ఎన్నికయ్యారు.
- పాలకోడేరు మండలం గొరగనమూడిలో దిడ్ల విమల (వైఎస్సార్‌సీపీ) ఎన్నికయ్యారు.
- ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కూటమి బలపర్చిన ముగ్గుళ్ల సత్యనారాయణ (సత్తిబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచాయతీలో 12 మంది వార్డు సభ్యులకు 9 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే అయినా కూటమి సానుభూతిపరుడు ఎన్నికవడం గమనార్హం.
- యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలో గోనమండ డేవిడ్‌రాజు (టీడీపీ) ఎన్నికయ్యారు.
- నరసాపురం మండలం మల్లవరంలో పులఖండం ఆదివిష్ణు శేషు (జనసేన) ఎన్నికయ్యారు.
- అత్తిలి మండలం కేఎస్ గట్టులో ఉడతల నరేష్ (టీడీపీ) దక్కించుకున్నారు.
- పాలకొల్లు మండలం గోరింటాడలో పార్శి రాజబాబు (వైఎస్సార్‌సీపీ), అగర్తిపాలెంలో కడలి శ్రీనివాస్ (టీడీపీ) ఎన్నికయ్యారు.
- భీమవరం మండలం తుందుర్రులో గోగులమండ సుగుణకుమారి (వైఎస్సార్‌సీపీ), ఎల్‌వీఎన్ పురంలో రామాని కన్యాకుమారి (వైఎస్సార్‌సీపీ), బేతపూడిలో బుంగా పండు (జనసేన), గొల్లవానితిప్పలో గుద్దటి రాజేష్ (జనసేన), గూట్లపాడులో కొప్పర్తి సత్తిపండు (జనసేన) ఎన్నికయ్యారు.
- మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో తిరుమాని శివగౌరి (జనసేన) ఎన్నికయ్యారు.

సెస్ బకాయిలు చెల్లించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్ బకాయిలను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సెస్ బకాయిలపై ఆయన సమీక్షించారు. గ్రంథాలయ సంస్థకు సెస్ రూపేణా రూ.4,53,48,404 బకాయిలు ఉన్నాయని, దీనిలో పంచాయతీల బకాయిలు రూ. 2,96,90768 ఉన్నాయన్నారు. మున్సిపాలిటీలుగా వారీగా ఇంటి పన్నులు, సెస్ బకాయిలపై నివేదిక సమర్పించాలన్నారు.

30న ఉగాది వేడుకలు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ విశ్వావసునామ ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఉగాది వేడుకలపై గురువారం ఆయన సమీక్షించారు. ఈనెల 30న వేడుకలు నిర్వహించనున్నామని అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఫీజులు కట్టలేదని విద్యార్థుల నిర్బంధం

నరసాపురం రూరల్: ఫీజులు కట్టలేదనే కారణంగా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను గదిలో నిర్బంధించిన ఘటన వెలుగుచూసింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం నరసాపురం-పాలకొల్లు జాతీయ రహదారిని ఆనుకుని సరిపల్లి పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లితండ్రులు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపుతో సంసిద్ స్కూల్ నిర్వహించడం దారుణమన్నారు. ఫీజుల కోసం విద్యార్థులను గదిలో బంధించడం బాలల హక్కులను కాలరాయడమే అన్నారు. విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పాఠశాల యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. స్కూల్‌కు వచ్చిన ఎంఈఓ పిల్లి పుష్పరాజ్యంకు ఫిర్యాదు చేశారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. విద్యార్థుల తల్లిదండ్రులు జి.శ్రీనివాస్ జి.రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.చందు పి.ధనంజయ, పి.సురేష్, జి.ధీరజు తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

న్యూస్‌రీల్

మా స్కూల్ మాకు కావాలి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వెస్ట్ గొంది మూల గ్రామస్తులు

నరసాపురం: మా స్కూల్ మాకు కావాలి.. మా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకుండా చేయొద్దు.. అంటూ నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ గొందిమూల గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా గ్రామాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలలను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేయడానికి ప్రయత్నిస్తుండటంతో గొందిమూల గ్రామస్తులు ఆందోళన చేశారు. సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ముందుగా గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఎంపీడీఓ కృష్ణంరాజు, ఎంఈఓ పుష్పరాజ్యంకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం నరసాపురం ఆర్డీఓ కార్యాలయంలో కూడా వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ అనాలోచిన నిర్ణయాలతో గ్రామాల్లో ప్రభుత్వ బడులు లేకుండా చేయడం దారుణమన్నారు. గ్రామస్తులు కవురు తులసి, తుమ్మ మాధవి, పోతుమేను దుర్గ, తుమ్మా లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్నాం

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'శునకాలు, పశువులకు స్కిన్ అలర్జీలు' శీర్షికన ఈనెల 25న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి తాడేపల్లిగూడెం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్‌కే సుధాకర్ స్పందించారు. ఆవులు, గిత్తల్లో ముద్ద చర్మ వ్యాధి కారణంగా మచ్చలు ఏర్పడ్డాయని, నివారణకు టీకాలు, చికిత్స అందిస్తామన్నారు. వీధి శునకాలకు పోషకాహార లోపం, ఇతర కారణాలతో చర్మంపై అలర్జీ మచ్చలు ఏర్పడతాయని, జుట్టు రాలిపోవడం సాధారణమని, ఇలాంటి శునకాలకు సరైన సమయంలో చికిత్స అందించాలన్నారు. అన్ని పశువుల ఆస్పత్రుల్లో స్కిన్ అలర్జీలకు వైద్యం అందుబాటులో ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురిని వివిధ హోదాల్లో నియమించారు. రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా పోలిశెట్టి గోపినాథ్, ఎస్సీ సెల్ సెక్రటరీ కొల్లాబత్తుల రవికుమార్, వలంటీర్స్ వింగ్ సెక్రటరీగా జి.అలివర్, వీవర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా మావూరి సత్యనారాయణ నియమితులయ్యారు.

బూత్ కమిటీల జోనల్ అధ్యక్షుడిగా బీవీఆర్



బీవీఆర్ చౌదరి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడేనికి చెందిన బీవీఆర్ చౌదరిని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల విభాగం జోనల్ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు ఆయన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ కన్వీనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకముంచి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

'అక్షరాభ్యాసం'కు జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారం అందుకుంటున్న దర్శకుడు హరీష్ ఉండ్రమట్ల

ఆకివీడు: జాతీయ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన 2024 లఘు చిత్రాల జాతీయ పురస్కారాల కార్యక్రమంలో ఆకివీడుకు చెందిన లఘు చిత్ర దర్శకుడు హరీష్ ఉండ్రమట్ల పురస్కారం అందుకున్నారు. వీధి బాలల జీవనశైలి ఇతివృత్తంతో, విద్యకు దూరమవుతున్న బాలలపై చిత్రీకరించిన అక్షరాభ్యాసం లఘుచిత్రం సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్ జాతీయ పురస్కారానికి ఎంపికైంది. అవార్డుతో పాటు రూ.50 వేల నగదును దర్శకుడు హరీష్ అందుకున్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో సేత్రామ్ మృతదేహం

ద్వారకాతిరుమల: టీ కోసం రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరగవాడ గ్రామానికి చెందిన బట్టు సేత్రామ్(55) లక్ష్మీనగర్‌లోని సింధూర పేపర్ ఫ్యాక్టరీలో వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. గురువారం రాత్రి టీ తాగేందుకు తన బంధువు బట్టు కృష్ణతో కలసి ఘటనా స్థలం వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో కొవ్వూరు నుంచి ఏలూరు వైపునకు వెళుతున్న కారు సేత్రామ్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సేత్రామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై సుధీర్ పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలి సజీవ దహనం


వర్ధనపు సరోజిని (ఫైల్)

పోడూరు: గుమ్మలూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఒంటరిగా నివసించే వృద్ధురాలు వర్ధనపు సరోజిని(72) సజీవ దహనమైంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని పెదపేట ప్రాంతంలో సరోజిని తాటాకింట్లో ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు భర్త, పిల్లలు లేరు. కాగా బుధవారం రాత్రి వంట చేశాక కట్టెలపొయ్యిని సరిగా ఆర్పకపోవడంతో రాత్రి 11 గంటల సమయంలో ఆమె నివసిస్తున్న ఇంటి నుంచి మంటలు వ్యాపించాయి. స్థానికులు చూసేసరికే మంటలు దట్టంగా వ్యాపించడంతో లోపలికి వెళ్లలేకపోయారు. అప్పటికే వృద్ధురాలు మంటల్లో చిక్కుకుని మృతి చెందింది. సమాచారం అందడంతో పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఆర్ఐ కె.రాంబాబు వివరాలు సేకరించారు. ఘటనపై ఎస్సై సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ సమక్షంలో వీఆర్ఓ కె.శ్రీనివాసరావు సరోజిని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతదేహం సగంపైగా కాలిపోవడంతో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఘటనా ప్రదేశానికి వచ్చి ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

పట్టపగలే ఇంట్లోకి వచ్చి చెయిన్ స్నాచింగ్

పాలకోడేరు: పట్టపగలే చెయిన్ స్నాచింగ్ చేసిన ఘటన శృంగవృక్షంలో కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. రావి చెర్వుగట్టున నివాసం ఉంటున్న పంపన అంజలి ఏడాది క్రితమే పెళ్లి చేసుకుని అత్తవారి ఇంట్లో ఉంటోంది. భర్త, అత్తమామలు కూలిపనికి వెళ్లగా ఆమె ఒక్కరే ఉన్న సమయంలో గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఒక వ్యక్తి శుభలేఖ ఇవ్వడానికి వచ్చానని చెప్పి.. తెల్ల కాగితం ఆమె చేతిలో పెట్టాడు. ఆమె మెడలో ఉన్న సూత్రాల తాడు గట్టిగా లాగడంతో వెంటనే తేరుకున్న అంజలి ప్రతిఘటించగా మెడపై నుంచి బలవంతంగా లాక్కుని పారిపోయాడు. ఇంటి బయట మరో అగంతకుడు మోటార్ బైక్‌పై ఉన్నట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పాలకోడేరు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ట్రిపుల్ ఐటీల్లో సమస్యలు తొలగేనా?

- ఇన్‌చార్జిల ఏలుబడిలో ట్రిపుల్ ఐటీలు
- కీలక నిర్ణయాలు తీసుకునేందుకు వెనకడుగు
- సమస్యలపై దృష్టిపెట్టని కూటమి ప్రభుత్వం
- సదుపాయాల కొరతతో విద్యార్థుల అవస్థలు
- నేడు ఆర్జీయూకేటీ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం


నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు : రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒక్కొక్క ట్రిపుల్ ఐటీలో 6,600 మంది చొప్పున నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి 26,400 మంది విద్యార్థులున్నారు. దేశంలోని 15 ఐఐటీల్లో కలిపి కూడా ఇంత మంది విద్యార్థులు ఉండరు. అంతటి ప్రాధాన్యం కలిగిన ట్రిపుల్ ఐటీని ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడిచినా ఇంతవరకు ఒక్క నిర్ణయం కూడా తీసుకోకుండా ఇన్‌చార్జి డైరెక్టర్లపైన, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌పైన పాలనను వదిలేసింది. వారంతా ఇన్‌చార్జిలు కావడంతో తమ కెందుకొచ్చిన గొడవ అని కీలక నిర్ణయాలను తీసుకునే విషయమై మిన్నకుంటున్నారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ల్యాప్‌టాప్‌లు లేవు, యూనిఫాం లేదు

ప్రస్తుత విద్యా సంవత్సరం ఏప్రిల్ నెలాఖరుకు ముగుస్తున్నా నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇంత వరకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేదు. అలాగే యూనిఫాం ఇవ్వలేదు. అడ్మిషన్లు పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమయ్యే రోజునే విద్యార్థులకు ఈ రెండూ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంత వరకు ఇవ్వకపోవడాన్ని బట్టే ట్రిపుల్ ఐటీలను గాలికి వదిలేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ల్యాప్‌టాప్‌లు లేకపోవడంతో విద్యార్థులు పీడీఎఫ్‌లు జిరాక్స్‌లు తీయించుకొని చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించే సంస్థలో ల్యాప్‌టాప్‌లు ఇవ్వడంలో ఇంత జాప్యంపై విమర్శలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఈ తొమ్మిది నెలలు గవర్నింగ్ కౌన్సిల్(జీసీ) మీటింగ్ జరగాలంటూ ట్రిపుల్ ఐటీ అధికారులు కూడా కాలయాపన చేసుకుంటూ వచ్చారు.

ల్యాబ్ అసిస్టెంట్‌లకు టైమ్ స్కేల్ ఇస్తారా?

ఆర్జీయూకేటీలో పనిచేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్‌లకు టైమ్ స్కేల్ ఇవ్వాల్సి ఉంది. గతంలో ఇది ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్లగా వారికి అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. దీంతో గత ఐదు నెలలుగా టైమ్ స్కేల్ ఇవ్వాలని ల్యాబ్ అసిస్టెంట్‌లు ఆర్జీయూకేటీ అధికారులను అడుగుతున్నారు. దీనికి వారు జీసీ అనుమతి ఉండాలంటూ టైమ్ స్కేల్ ఇవ్వకుండా కాలం గడుపుకొస్తున్నారు.

ఆరు వేల మందికి ఒకరే మెస్ నిర్వాహకుడు

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని 6,600 మంది విద్యార్థులకు ఒకే మెస్ నిర్వాహకుడు రెండు పూటలా భోజనాన్ని, ఒకపూట టిఫిన్‌ను అందించాల్సి రావడంతో విద్యార్థులకు సకాలంలో భోజనం అందకపోవడంతో పాటు ఒకే నిర్వాహకుడికి అప్పగించడం కూడా సమంజసం కాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది సెప్టెంబర్ 20న నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించిన త్రిసభ్య కమిటీ అక్టోబర్ మొదటి వారానికల్లా మెస్ టెండర్లను పిలిచి మెస్ నిర్వాహకులను నియమిస్తామని చెప్పారు. ఇది చెప్పి ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు కనీసం టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభించలేదు. ఇంత దారుణమైన పరిస్థితి దేశంలో ఇంకెక్కడా ఉండదనే అభిప్రాయం ట్రిపుల్ ఐటీలో సర్వత్రా వ్యక్తమవుతోంది.

పూర్తిస్థాయి అధికారులనే నియమించలేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇంత వరకు రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు డైరెక్టర్లను గాని, ఆర్జీయూకేటీకి వైస్ చాన్సలర్‌ను గాని, చాన్సలర్‌ను గాని ఇంత వరకు నియమించలేదు. డైరెక్టర్లు, వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్ అందరూ ఇన్‌చార్జిలే ట్రిపుల్‌ఐటీల పాలనను నెట్టుకొస్తున్నారు. ఈ ఇన్‌చార్జిలు కీలకమైన నిర్ణయాలు తీసుకోవడంలో సాహసం చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 28న గవర్నింగ్ కౌన్సిల్(జీసీ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో ఇన్‌ఛార్జి వైస్‌చాన్సలర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, నలుగురు ఇన్‌చార్జి డైరెక్టర్లు, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్య సెక్రటరీ, ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ హైదరాబాద్‌కు చెందిన డైరెక్టర్లు, మరికొందరు ఈ జీసీ సమావేశంలో పాల్గొననున్నారు. కొందరు ఆన్‌లైన్‌లోను, మరికొందరు నూజివీడు ట్రిపుల్‌ఐటీ నుంచి ఈ మీటింగ్‌లో పాల్గొననున్నారు. ఈ సమావేశంలోనైనా సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకుంటారో లేదోనని ట్రిపుల్ ఐటీల సిబ్బంది వేచి చూస్తున్నారు.

సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలు


అటవీశాఖ ఆధ్వర్యంలో తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచి పెడుతున్న విద్యార్థులు

నరసాపురం రూరల్: అంతరించిపోతున్న జీవరాశులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం నరసాపురం మండలం చినమైనవానిలంక గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పొదిగించబడిన ఆలివ్ రిడ్లే జాతికి చెందిన తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి పాఠశాల విద్యార్థులతో కలిసి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను సెక్షన్ ఆఫీసర్, ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ సత్యనారాయణ నివృత్తి చేశారు. ఆలివ్ రిడ్లే జాతికి చెందిన ఈ తాబేళ్లు ఆహార అన్వేషణ, గుడ్లుపెట్టడం, సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. తాబేళ్ల జాతి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పిల్లలు బయటకు రావడంతో గుర్తించి అటవీశాఖ ఆధ్వర్యంలో వాటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె రాంప్రసాద్, ఉపాధ్యాయుడు జి రవీంద్రరాజు, గ్రామస్తులు ఎంపీ కుమారస్వామి, విద్యార్థులు, తాబేళ్ల సంరక్షణా పునరుత్పత్తి కేంద్రంలో పనిచేసే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు దోహదం


సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

వీరవాసరం : కళలు, కళాకారులు ఎక్కడైతే గౌరవించబడతారో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి నాటక పోటీల సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటక ప్రదర్శనలు సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ఎంతో దోహదపడతాయన్నారు. టీవీ రంగం మనిషిని చిన్నగా, సినిమారంగం మనిషిని పెద్దగా చూపిస్తుందని, మనిషిని మనిషిగా ఒక్క నాటక రంగమే చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాటక పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, అల్లు రామకృష్ణ, గంట ముత్యాల నాయుడు, రామ్మోహన్ రావు, వెంకటరత్నం, పాలా ఆంజనేయులు, కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె బాటలో మీటర్ రీడర్లు!

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీతో విఫలమైన చర్చలు
- వచ్చే నెల 1 నుంచి సమ్మె ఆలోచన
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుంటే వినియోగదారులపై భారం


విశాఖపట్టణంలో విద్యుత్ మీటర్ రీడర్ల నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ మీటర్ రీడర్లు సమ్మెబాట పట్టనున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు అమలు చేయాలని కోరుతూ విద్యుత్ మీటర్ల రీడర్లు గత కొంతకాలంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారంపై యూనియన్ నాయకులు పెనుమాక జాకబ్, వంశీ, శేఖర్, శ్రీనివాస్, రమణ గురువారం విశాఖపట్నంలో సీఎండీతో చర్చలు జరిపారు. అయితే అవి విఫలం కావడంతో రీడర్స్ యూనియన్ నాయకులు కార్యాచరణలో భాగంగా వచ్చే నెల 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీటర్ రీడర్లు సమ్మెలోకి వెళ్లనున్నారు.

వినియోగదారులపై భారం

ప్రతి నెలా 1 నుంచి 12వ తేదీ లోపు మీటర్ రీడర్లు ఇంటింటికి వెళ్లి విద్యుత్ మీటర్ల రీడింగ్ తీయాల్సి ఉంది. విద్యుత్ మీటర్లు సమ్మెబాట పట్టి, విద్యుత్ అధికారులు ప్రత్యామ్నాయా ఏర్పాట్లు చేయకుంటే బిల్లుల శ్లాబ్ రేట్లు మారిపోయి అదనపు భారం పడే అవకాశం ఉండడం వినియోగదారుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 5,700 మంది మీటర్ రీడర్లు ఉండగా పశ్చిమగోదావరి జిల్లాలో 750 మంది రీడర్లు ఉన్నారు. వీరు సమ్మె బాట పడితే 20 లక్షల సర్వీస్‌లకు ఇబ్బందులు కలగనున్నాయని ఆందోళన వ్యక్తం అవుతుంది. మీటర్ రీడర్లు సమ్మెలోకి వెళితే తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ముగియనున్న కాంట్రాక్టర్ల గడువు

ఇదిలా ఉంటే విద్యుత్ మీటర్లకు సంబంధించి కాంట్రాక్టర్ల గడువు ఈనెలాఖరుతో ముగియనుంది. ఏప్రిల్ 1, 2023 నుంచి కాంట్రాక్టు మొదలుకాగా ఈనెలాఖరికి రెండేళ్ల గడువు తీరనున్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటివరకు ఎటువంటి పొడిగింపు ఇవ్వలేదని వారు అంటున్నారు. మీటర్ రీడర్లు సమ్మె చేస్తే ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. దీనిపై విద్యుత్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తిను వివరణ కోరగా మీటర్ రీడర్లు సమ్మెలోకి వెళుతున్నట్లు తమకు ఇంకా తెలియదన్నారు. ఇప్పుడు పనిచేస్తున్న కాంట్రాక్టర్లు వచ్చే నెలలో కూడా మీటర్లు రీడింగ్ తీసేందుకు సమ్మతి ఇచ్చారని ఎస్ఈకు పంపామని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రావని వివరించారు.

బంగారం షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


బంగారం షాపుల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్)/పాలకొల్లు (సెంట్రల్): ఏలూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబు ఆదేశాల మేరకు భీమవరం, పాలకొల్లు పట్టణాల్లోని బంగారం షాపులపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, సేల్స్ టాక్స్ అండ్ లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భీమవరంలోని శ్రీ సునీత జ్యూయలర్స్, వీకే బులియన్ గోల్డ్ షాపుల నందు అన్ స్టాంప్డ్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్ ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా సునీత జ్యూయలర్స్ షాప్ నందు రికార్డుల్లో ఉండాల్సిన దాని కంటే వెండి నిల్వలు 5 కేజీలు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. అలాగే పాలకొల్లులో జరిపిన తనిఖీల్లో పట్నాల బ్రదర్స్ జ్యూయలరీ షాప్ నందు బంగారపు నిల్వల్లో 253 గ్రాములు, వెండి నిల్వల్లో 1500 గ్రాములు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. శ్రీనివాస జ్యూయలర్స్ షాప్‌లో బంగారం నిలువల్లో 92 గ్రాములు, వెండి నిల్వల్లో వెయ్యి గ్రాములు తక్కువ ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఆయా బంగారం షాపులపై అధికారులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు పి శివరామకృష్ణ, డి ప్రసాద్‌కుమార్, విజిలెన్స్ ఎస్సైలు సీహెచ్ రంజిత్‌కుమార్, కె.సీతారామ, సేల్స్ టాక్స్ అధికారులు పీవీ హేమమాలిని, ఎస్‌కే షబ్బీర్, లీగల్ మెట్రాలజీ అధికారి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

భీమవరం అర్బన్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రు గ్రామానికి చెందిన వేగేశ్న రామరాజు (63) గత కొంతకాలంగా ఆక్వా చెరువులు చేస్తున్నాడు. చెరువుల్లో పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రామరాజు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి రామరాజును భీమవరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య వేగేశ్న మణి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెల్లమిల్లిలో టీడీపీ నాయకుడికి దేహశుద్ధి?

ఉంగుటూరు: వెల్లమిల్లి గ్రామంలో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న టీడీపీ నాయకుడికి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. వివరాల ప్రకారం.. గ్రామంలోని ఒక కుటుంబానికి చెందిన భార్యభర్తలు వివిధ కారణాల వల్ల విడివిడిగా ఉంటున్నారు. వివాహిత తండ్రి వద్ద ఉంటోంది. భార్యభర్తల మధ్య సమస్యను పరిష్కరించేందుకు వచ్చిన టీడీపీ నాయకుడు కొన్నాళ్లుగా ఆ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆ మహిళ దగ్గరకు నాయకుడు రాగా అప్పటికే అక్కడ మాటువేసిన మహిళ భర్త, అతని బంధువులు ఆ నేతను చితకబాదినట్లు తెలిసింది. దీనిపై పెద్ద గొడవ అవ్వడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్ది వెళ్లినట్లు సమాచారం. అయితే ఈవిషయంపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

‘ఉపాధి హామీ’లో రజక వృత్తి చెరువులను బాగుచేయాలి

ఏలూరు (టూటౌన్): రజక వృత్తి చెరువులను ఉపాధి హామీ పథకం ద్వారా పూర్తి స్థాయిలో బాగుచేయించేందుకు అధికారులు చొరవ చూపాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య కోరారు. ఏలూరులోని రజక జనసంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రజకులు వృత్తి చెరువులు పూడికలతో నిండి విస్తీర్ణం కోల్పోయిన పరిస్థితి నెలకొందని చెప్పారు. పలుచోట్ల పూడికల కారణంగా రజక వృత్తికి తీవ్ర అవరోధంగా మారి రజకులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో రజక వృత్తి చెరువులను బాగుచేయించాలని కోరారు. ముఖ్యంగా గోపాలపురం, పోలవరం, నల్లజర్ల, చాగల్లు, ఉండి, తాడేపల్లిగూడెం, నియోజకవర్గాలు మండలాల్లోని చెరువులను బాగుచేయించాలని కట్లయ్య కోరారు. ఈ సమావేశంలో జిల్లా రజక నేతలు వట్లూరు మురళి, వి.శ్రీనివాసులు, శేషు, ఆర్.నాగేశ్వరరావు, మొలగాల దుర్గారావు, దేవరపల్లి రజక నాయకులు కదిలి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

మృతుని కుటుంబానికి పరామర్శ



సత్యనారాయణ కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన మాదేపల్లి సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మృతుని కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కనుపూరి ఉదయభాస్కర్, నాయకులు వెలిశెట్టి నరేంద్ర కుమార్, దండే గోతియ్య, గార్లపాటి వీరకుమార్, సిర్రాపు శాంతకుమార్, బోళం రమణ ఉన్నారు.

రీ-సర్వేకు అందరూ సహకరించాలి



కృష్ణాయపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: రీ-సర్వే కార్యక్రమానికి అందరూ సహకరించాలని నవాబుపాలెం సర్పంచ్ బేతపూడి వెంకటసుబ్బలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో భూముల రీ-సర్వే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బలక్ష్మి మాట్లాడారు. ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో రైతులకు భూ సర్వేపై పూర్తి అవగాహన కల్పించి, వారి సూచనలు తీసుకొని ముందుకెళ్లాలన్నారు. తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మండల సర్వేయర్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ లీలాకృష్ణ, వీఆర్వో రాంబాబు, కార్యదర్శి హరికిషోర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం 5వ రోజు మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం, భీమవరంకు చెందిన ఘనాపాటి యావని రామచంద్ర సోమయాజులు, పరిమెళ్లకు చెందిన బాదంపూడి ఫణీంద్ర శర్మలు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులచే వైభవంగా చండీ హోమం నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచంగవ్యం, మండప ఆరాధన, చండీ పారాయణం, పూర్ణాహుతిలు జరిగాయి. రాత్రి శ్రీ నటరాజ డ్యాన్స్ అకాడమి చిన్నారులచే కూచిపూడి, జానపద నృత్యాలు అలరించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి, సభ్యులు పర్యవేక్షించారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



డైరక్టర్ సుబ్బారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థలు, ఇతర ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని, ఆ విధానాలను అరికట్టాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపాశంకర్ (తాడేపల్లిగూడెం) డిమాండ్ చేశారు. మంగళగిరిలో ఏపీ పాఠశాల డైరక్టర్ ఎ.సుబ్బారెడ్డిని ఆయన కార్యాలయంలో గురువారం కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వివరాలను పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రూపాశంకర్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికిగాను ఇప్పుడే పుస్తకాలు కొనాలని అనడం సరైన చర్య కాదన్నారు. పుస్తకాలను డోర్ డెలివరీ చేస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, అక్రమ అడ్మిషన్లు చేస్తున్న సంస్థలను కట్టడి చేయాలని కోరారు. ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల, పుస్తకాలు అమ్మకాలు వ్యవహారాలలో విద్యా శాఖ జోక్యం చేసుకోకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, బి.సిద్దు, సభ్యులు ఎస్.శ్రీను, మణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి శ్రేణుల బరితెగింపు

- పోలీసుల తీరుపై విమర్శలు
- ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యం
- ఉద్రిక్తత పరిస్థితులున్నా పట్టని పోలీసులు
- జనం లేని చోటే పహారా



అత్తిలిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద జనం లేని చోట పోలీస్ పహారా



అత్తిలిలో ఎంపీటీసీలను అడ్డుకుంటున్న కూటమి శ్రేణులు

అత్తిలి: సజావుగా జరిగాల్సిన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియను కూటమి నాయకులు అడ్డుకున్నారు. అత్తిలి ఎంపీపీ అభ్యర్థిగా రంభ సుజాత, వైస్ ఎంపీపీగా అద్దంకి శ్రీను ఎన్నుకునేందుకు అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసం నుంచి గురువారం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు బయలుదేరారు. పలు గ్రామాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కూటమి శ్రేణులు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటికి వెళ్లే రెండు మార్గాలను దిగ్బంధించారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు 13 మంది ఉన్నప్పటికీ ఎన్నికను వాయిదా వేయాలనే తలంపుతో కూటమి నాయకులు కుట్రలు పన్నారు. మాజీ మంత్రి ఇంటి నుంచి మండల పరిషత్ కార్యాలయానికి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌తో కలిసి వస్తున్న ఎంపీటీసీ సభ్యులను కూటమి శ్రేణులు అడ్డుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కూటమి నాయకులు ఎంత కవ్వించినప్పటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటిస్తూ వచ్చారు. ఇంత గొడవ జరుగుతున్నా లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీసులు కనుచూపు మేర కనిపించలేదు.

జనంలేని చోట పోలీస్ పహారా

మండల పరిషత్ కార్యాలయ పరిసరాలలో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు మోహరించాయి. జనసంచారం లేని ప్రదేశాలలో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసి హడావిడి చేసిన పోలీస్ సిబ్బంది, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు గృహాన్ని నిర్బంధించి ఎంపీటీసీ సభ్యులు బయటకు రాకుండా చేసిన కూటమి శ్రేణులపై కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడంతో హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొంటున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ కూడా అత్తిలి గ్రామంలో జరగలేదని చెబుతున్నారు.

నేటికి వాయిదా

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికను శుక్రవారం నాటికి వాయిదా వేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఓటింగ్ సమయానికి ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరుకాకపోవడంతో తగినంత కోరం లేకపోవడంతో ఎన్నిక ప్రక్రియను వాయిదా వేశామని చెప్పారు.

స్విమ్మింగ్ పూల్ పనులకు ఎదురీత

అస్తవ్యస్తంగా పరిసరాలు



అపరిశుభ్రమైన నీటితో స్విమ్మింగ్ పూల్



స్విమ్మింగ్ పూల్ ఆవరణలో చెట్లు, అపరిశుభ్రమైన వాతావరణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో స్థానిక కడకట్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ (ఈతకొలను) వినియోగంలోకి రాకుండానే శిథిలమైంది. స్విమ్మింగ్ పూల్ వస్తుందనుకున్న యువత ఆశలు అడియాసలయ్యాయి. స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేసి అందరికి అందుబాటులోకి తీసుకురావాలని యువత కోరుతున్నారు. వివరాలలోకి వెళ్లితే..

యువత స్విమ్మింగ్ చేసేందుకు ఆసక్తి:

యువత స్విమ్మింగ్ చేసేందుకు ఆసక్తి కనపర్చడం, దీంతో వారు ఈత నేర్చుకునేందుకు, ఈత కొట్టేందుకు స్థానికంగా ఉన్న కాలువ పొడవున, చెరువులను ఆశ్రయించడం, ఈ క్రమంలో స్థానిక ఏలూరు కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకులు ప్రమాదవశాతు మృత్యువాత పడ్డారు. ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు తిరిగి జరగకుండా ఉండేందుకు అప్పటి దివంగత మంత్రి పైడికొండల మాణిక్యాలరావు (కూటమి ప్రభుత్వం) పట్టణంలో ఒక స్విమ్మింగ్ పూల్ ఉండాలనే ఉద్దేశ్యంతో ఈత కొలను ఏర్పాటుకు ఉపక్రమించారు. స్థానిక కడకట్ల హెచ్‌పీ కాల్ గ్యాస్ సమీపంలోను ద్వారకా నగర్ రోడ్డు నెంబర్ 5 మార్గంలో ఈత కొలను ఏర్పాటుకు నిర్ణయించారు. ఈతకొలను నిర్మాణానికి రూ.1 కోటి 35 లక్షల రూపాయిలకు పైగా ఖర్చు చేసి నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. చుట్టు ప్రహరీ, ఈతకొలను, అవసరమైన హంగులతో, గదులతో నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు చాలా వరకు జరిగాయి. అనంతర కాలంలో అప్పట్లో రాజకీయ విభేదాలు కారణంగా ఆ పనులు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి. నేడు ఈతకొలను నిర్మాణం పూర్తి కాకుండానే, ఒక్కరు కూడా నీటి కొలనులో దిగకుండానే పనులు ఆగిపోయాయి.

శిథిలావస్థలతో ఈత కొలను:

నేడు ఆ నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. ఈత కొలనులో నీరు పసర్లుతోను, పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతుంది. ఫ్లోరింగ్, గోడులు దెబ్బతిన్నాయి. పరిసరాలు తుప్పలు, ముళ్ల మొక్కలు, డొంకలతో, వ్యర్థాలతోను, దట్టమైన మొక్కలతో అపరిశుభ్రంగాను, అస్తవ్యస్తంగా మారింది. ఈ కారణంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణ ప్రాంతంలో విష జంతువులైన పాములు, ముంగిసలు బెడద అధికం కావడంతో ఆప్రాంత వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పట్టణ శివారులో ఉండటంతో రాత్రి సమయాల్లో ఆసాంఘీక కార్యక్రమాలకు ఈత కొలను ప్రాంతం అడ్డాగా మారింది. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఈ పనులను పూర్తి చేయాలని, స్విమ్మింగ్ పూల్‌ను అందరికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, స్విమ్మింగ్ పూల్ పై ఆసక్తి ఉన్న యువతీ యువకులు కోరుతున్నారు.

ఈతకొలను అభివృద్ధి చేయాలి



స్థానిక కడకట్ల వద్ద శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన ఈతకొలను అందరికి అందుబాటులోకి తీసుకురావాలి. ఈతకొలను ఉంటే ఈత నేర్చుకునేందుకు కాలువలు వద్దకు, చెరువులు వద్దకు ఎవరూ వెళ్లరు. స్విమ్మింగ్ పూల్ ఉంటే ఈత నేర్చుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఎటువంటి ప్రమాదాలు సంభవించవు. ఈత నేర్పేందుకు వీలుగా ట్రైనర్స్‌ను కూడా అందుబాటులో ఉంచాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు అభివృద్ధి చేయాలి.

– దామరాజు వరప్రసాద్, తాడేపల్లిగూడెం

అల్లా చల్లని ఆశీస్సులతో అందరూ బాగుండాలి

మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



మసీదులో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : అల్లా చల్లని ఆశీస్సులతో అందరూ బాగుండాలని మాజీ ఉపముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మస్జీద్ ఏ మహ్మదీయ అహల్పె హదీస్ మసీదు, వీకర్స్ కాలనీలోని మస్జిద్ నూర్ మసీదులో గురువారం ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధించిన ఖురాన్ గ్రంథం పవిత్ర గ్రంథంగా నిలిచిందన్నారు. హిందూ ముస్లింలు సోదరభావంతో ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందిస్తూ మంచి సంప్రదాయ పద్ధతులలో పయనిస్తున్నారన్నారు. రాజకీయాలకు సంప్రదాయాలకు సంబంధం లేదన్నారు. కరోనా సమయంలో రంజాన్ మాసంలో ముస్లిం సోదరులను కలవలేకపోయినా మిగిలిన అన్ని రంజాన్ పండుగల్లో తాను పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ముస్లిం సోదరులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి వారి అభివృద్ధికి బాటలు వేసి ఘనత వైఎస్సార్‌కు దక్కిందన్నారు. అల్లా కృప వల్ల ప్రజలందరూ సంతోషంగా ఉండాలని అభిలాషించారు. ఇమామ్‌లు షఫీ ఉర్ రెహమాన్, ఇల్యాస్, అల్తాఫ్, షేక్ అహ్మద్, అమీర్‌ఖాన్, పఠాన్ అమీర్, సాల్యాహ్, ఆసిఫ్, లాలు, అహ్మద్, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, ఆరిమిల్లి రవి, పత్తి వీరకుమార్, కునుపూరి భాస్కరాచార్యులు, జొన్నల సత్యనారాయణ, చామన సూచ్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



పెంటపాడులో ముస్లింలకు నిత్యావసరాల వస్తువులు పంపిణీ చేస్తున్న ప్రసాద్‌రెడ్డి తదితరులు

పెంటపాడు: రంజాన్ పండుగ సందర్భంగా గురువారం ఎంబీఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో 150 మంది ముస్లింలకు రూ. 2.40 లక్షల విలువైన నిత్యావసరాలు, కూరగాయలు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెంటపాడు షాదీఖానా వద్ద జరిగిన ఈ సమావేశంలో ముస్లీం సంఘ నాయకులు షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ గత 14 ఏళ్లగా ఎంబీఆర్ ఫౌండేషన్ క్రమం తప్పకుండా ప్రతీ రంజాన్‌లోనూ పేద ముస్లింలను గుర్తించి వారికి తోఫా సరుకులు అందజేయడం జరుగుతుందన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి తమ వంతు సేవ చేసేందుకు గాను ఎంబీఆర్ సంస్థను స్థాపించి అధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి, పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సుధా శ్రీనివాసరెడ్డి, బర్ల జయరాంబాబు, మేడపాటి హరేంద్రరెడ్డి, రెడ్డి శ్రీను, ఉండ్రాజవరపు రాజు, బండారు రాంబాబు తదితరులు మాట్లాడుతూ ఎంబీఆర్ సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముస్లీం పెద్దలు, సంఘ నాయకులు షేక్ హుస్సేన్, షేక్ ఇస్మాయేలు, షేక్ బాజీ , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్ డే



తణుకులో రామకృష్ణకు కేకు తినిపిస్తున్న కార్పెంటర్స్ సంఘ గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ

తణుకు అర్బన్: కార్పెంటర్ డే వేడుకను గురువారం తణుకు నరేంద్ర సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. వడ్రంగి సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించి ప్రయాణికుల దాహార్తిని తీర్చారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఏఎంసీ చైర్మన్ బసవ రామకృష్ణ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పెంటర్ డే పురస్కరించుకుని కార్పెంటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వల్లూరి రామకృష్ణ, అధ్యక్షుడు చిక్కాల సూర్యనారాయణ మాట్లాడుతూ కార్పెంటర్ డే రోజున ప్రతి ఏడాది వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం తణుకు మండల అధ్యక్షుడు మందవరపు నాగ మనోహర్, ప్రధాన కార్యదర్శి మోగంటి అచ్యుతం, కోశాధికారి గన్నవరపు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కె.శ్రీనువాసు, సహాయ కోశాధికారి టి.ప్రసాద్, అధికారప్రతినిధి కె.సోమాచార్యులు, కె.చంద్రమౌళి, దుర్గారావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

కొత్తపాడు ఉప సర్పంచ్‌గా విజయ



మండపాక విజయ ఏకగ్రీవ ఎన్నిక

ఇరగవరం: మండలం కొత్తపాడు గ్రామ ఉప సర్పంచ్ పదవిని వైఎస్సార్ సీపీ అభ్యర్థి కైవసం చేసుకున్నారు. గురువారం నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా మండపాక విజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాంప్రదాయానికి విరుద్ధంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఉండకూడదని కూటమికి ఎటువంటి బలం లేకపోయినప్పటికీ ఉప సర్పంచ్ చేజిక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేసింది. కూటమి నాయకులు పంచాయతీ బోర్డు మెంబర్లకు అనేక విధాలుగా ప్రలోభాలు పెట్టినప్పటికీ వారు వేటికి తలవంచలేదు. దీంతో వారు చేసేవి ఫలించకపోవడంతో ఓటమి కూటమి నాయకులు తోక ముడిచారు. ఉప సర్పంచ్‌గా గెలుపొందిన మండపాక విజయను సొసైటీ మాజీ అధ్యక్షుడు పెనుమత్స రాంబద్ర రాజు , మండల వైఎస్‌ఆర్సిపి అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, పంచాయతీ బోర్డు మెంబర్లు సర్పంచ్ అభినందించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



సబ్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమష్టి కృషితో కీటకజనిత వ్యాధులను అరికడదామని, ఆరోగ్య నియమాలు పాటించుట ద్వారా ఆరోగ్య భద్రత సాధిద్దామని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్ జంక్షన్ పరిధిలోని 9, 16 వార్డులలో గురువారం వెక్టార్ కంట్రోల్ హైజీన్, క్షేత్ర స్థాయి పరిశీలనలు, ర్యాలీలు, ప్రజలకు అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అవగాహన ర్యాలీ జరిగింది. దోమల నిర్మూలించేందుకు కృషి చేయడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలని తదితర విషయాలను చర్చించారు. దోమలను నిలువరించేందుకు దోమ తెరలు తప్పక వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో దీపిక, వెంకట లక్ష్మి, చంద్ర, సిబ్బంది, ఆశాలు, సుజాత, లక్ష్మీదుర్గ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



తణుకులో సత్కారం పొందిన టిక్‌టాక్ స్టార్ మూర్తి

తణుకు అర్బన్: రంగస్థలంలో ఎంతో మంది కళాకారులు తమ కళా చాతుర్యంతో ఆహుతులను కట్టిపడేశారని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా తణుకు బాబు వారి వీధిలోని ఆక్సిజన్ హాస్పిటల్ ఆవరణలో గురువారం నిర్వహించిన రంగస్థల సభలో ఆయన మాట్లాడారు. కళారంగంలో ఎంతో మంది కళాకారులు తమ ప్రతిభాపాటవ్యాలను చూపించి చరిత్రలో నిలిచిపోయారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మండపాక గ్రామానికి చెందిన యువ సినీ నటులు, టిక్ టాక్ స్టార్, వైటీ మూర్తితోపాటు ప్రముఖ రంగస్థలం కళాకారులు సిద్ధ రామకృష్ణ, రమణమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని అభినందనలు తెలియజేశారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెంటపాడు: అత్యుత్తమ విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల ద్వారానే సాధ్యమని ముదునూరు గ్రామ సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి పేర్కొన్నారు. ముదునూరు గ్రామంలో బీసీ కాలనీకి చెందిన విద్యార్థి రాజులపాటి రాధామాధవ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ నవోదయ ప్రవేశ పరీక్షలో 85.5 మార్కులతో ర్యాంక్ సాధించాడు. కాగా తల్లిదండ్రులు గ్రామంలో వ్యవసాయ కూలీలు. కాగా పట్టుదలతో చదివి నవోదయ ర్యాంక్ సాధించిన మాధవ్‌ను గ్రామ సర్పంచ్ ధాన్యలక్ష్మితో పాటు ఎంఈవోలు శ్రీనివాస్, రామకృష్ణలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీ చిట్టెమ్మ, హెచ్‌ఎం డి. శ్రీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, హర్ష, తల్లిదండ్రులు, స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం అభినందనీయం



తణుకులో తరగతి గదులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థి తండ్రి పెన్మెత్స శివరామరాజు

తణుకు అర్బన్: గెయిల్ సంస్థ, పూర్వ విద్యార్థులు కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం అందజేస్తున్న వసతులు అభినందనీయమని శ్రీచిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్ కుమార్ అన్నారు. కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్వ విద్యార్థుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన ఆరు తరగతి గదులతోపాటు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా సమకూర్చిన 40 డ్యూయల్ డెస్కులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు కళాశాలకు 40 డ్యూయల్ డెస్కులను విరాళంగా అందజేయడం వారి దాతృత్వాన్ని తెలియజేస్తుందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు మరిన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, తణుకు పుర ప్రముఖులు అందరూ తమ వంతు సహాయ సహకారాలు కళాశాలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సంకు మనోరమ, ఆర్ఎస్ఎం భూపాల్, గమిని రాంబాబు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయడం సరికాదు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాల మహానాడు నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ తొలుత బీజేపీ రాష్ట్రాలలో అమలు చేయాలని, అప్పుడు ప్రభుత్వాలకు వాస్తవాలు తెలియవస్తాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనువాదాన్ని మళ్లీ తేవడానికే ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తున్నారని విమర్శించారు. రానున్న రోజులలో ఎస్సీ వర్గీకరణ బిల్లును సవాల్ చేస్తు కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ ఏక సభ్య కమిషన్ కాదని, మాదిగ, ఉపకులాలకు ఏకపక్ష కమీషన్ రిపోర్టు అన్నారు. వర్గీకరణ చేయడం ద్వారా మాలలను అణిచివేయడమే లక్ష్యంగా పాలకులు, పార్టీలు ఒకటైనట్లు తెలిపారు. తమ స్వార్థ ప్రయోజనాలు కోసం ప్రభుత్వానికి తలొగ్గారని విమర్శించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్.రాజేష్, శరత్‌బాబు, మంద ప్రసాద్, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి



నిట్‌లో మాట్లాడుతున్న ట్రివర్జిన్స్ సీఈఓ వడ్లమూడి రోజా

తాడేపల్లిగూడెం: విద్యార్థులు విభిన్నంగా ఆలోచిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, వినూత్నం, విభిన్నంతోనే వారిలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికివస్తుందని ట్రివర్జిన్స్ టెక్నో ఇన్నోవేషన్ లిమిటెడ్ సీఈఓ వడ్లమూడి రోజా అన్నారు. ఏపి నిట్‌లో గురువారం ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్టార్టప్ ఇండియా ఎక్స్‌పో కార్యక్రమం జరిగింది. అతిథిగా రోజా హాజరయ్యారు. విద్యార్థులు సృజనశీల ఆలోచనలకు ఆకృతినిస్తే అంకుర పరిశ్రమలు ఊపిరిపోసుకుంటాయన్నారు. భారతదేశం రూపురేఖలు మార్చే శక్తి యువతకే సొంతమన్నారు. విద్యార్థులు తమలో ఉన్న శక్తి సామర్థ్యలను వెలికి తీయాలన్నారు. కాలానికి తగిన ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని కోరారు. డీన్‌లు వి.సందీప్,ఎన్‌జయరామ్ మాట్లాడుతూ సృజనశీలత ఉంటే స్టార్టప్‌లు ఏర్పాటు చేయవచ్చన్నారు. విద్యార్థులు అనుక్షణం శ్రమిస్తూ పారిశ్రామికవేత్తల స్థాయికి ఎదాదగాలని ఆకాంక్షించారు. గేట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపించిన ర్యాంకర్లను అభినందిస్తున్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఆచార్యులు పి.శంకర్, టి.కిరణ్, ఫణికృష్ణ, శాస్త్రి, కిషోర్, రాజేష్, కోడీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.